క్లుప్తంగా

పెడన పీహెచ్‌సీ తనిఖీ



పెడన: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి మంగళవారం పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. ఓపీని పరిశీలించి రోజుకు ఎంతమంది వస్తున్నది వైద్యాధికారి పర్వేజ్ హైదర్‌ను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను, ఇన్‌పేషెంట్ వార్డును పరిశీలించి అప్పుడే ప్రసవించిన తల్లి బిడ్డల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ఆశా డే సమావేశంలో పాల్గొని సిబ్బందికి, ఆశావర్కర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సుల్లో ప్రయాణికుల కోసం రేపల్లెకు చెందిన నాగార్జున నర్సింగ్ హోం నిర్వాహకులు డాక్టర్ వల్లభనేని కృష్ణచైతన్య, ఆయన తండ్రి వల్లభనేని బుచ్చయ్య చౌదరి ఫస్ట్ ఎయిడ్ కిట్లను డిపో మేనేజర్ కె. హనుమంతరావుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ శ్రీలక్ష్మీ, అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన శెట్టి బాలరాజు కుటుంబానికి మట్టి ఖర్చుల కింద రూ. 10 వేలను ఎంపీపీ వి. చినబాబు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యనుముల కొండ, పి. వెంకటేశ్వరరావు, ఎల్. మారుతి, వై. వరలక్ష్మీ, వార్డు సభ్యుడు జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏఎంసీ నూతన డైరెక్టర్లకు సన్మానం



చల్లపల్లి: కొడాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లుగా చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడకు చెందిన రైతు ప్రముఖులు, లక్ష్మీపురం పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ (నాని), చల్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ యువ నాయకుడు అబ్దుల్ అర్షద్ నియమితులయ్యారు. వారిని వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

కొడాలి మార్కెట్ యార్డు చైర్మన్‌గా వెంకట్రావ్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి కొడాలి మార్కెట్ యార్డు చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. తనపై నమ్మకం ఉంచి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావుకు వెంకట్రావ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రావ్‌ను పలువురు పార్టీ నాయకులు, ప్రముఖులు అభినందించారు.

స్కూల్ బస్సు డ్రైవర్ అరెస్ట్

గూడూరు: పాఠశాల బస్సుకు క్లీనర్‌గా పని చేస్తూ సోమవారం గురిజేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లా మణికంఠ (21) మృతి చెందిన ఘటనపై గూడూరు ఎస్‌ఐ వి.వెంకటేష్ కేసు నమోదు చేశారు. మంగళవారం బందరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మణికంఠ మృతికి కారణమైన డ్రైవర్ కోలపల్లి వీర వెంకట మల్లికార్జునరావు(48)ను అరెస్ట్ చేశారు.

కనుల పండువగా స్వామి వారి గ్రామోత్సవం



పెడన: పట్టణంలోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వారికి మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి మహోత్సవాన్ని పురస్కరించుకుని దేవదాయ శాఖ, పాలకవర్గం సౌజన్యంతో రెండు రోజులుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరాశరం కృష్ణప్రసాద్ ఆచార్యుల వారి ఆధ్వర్యంలో అర్చకస్వామి అగ్నిహోత్రం హరికృష్ణ ఆయా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహా సుదర్శన హోమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. మహాపూర్ణాహుతి, నీరాజనం కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఆలయం నుంచి పెడన బస్టాండ్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. సత్యసాయి మందిరం విద్యార్థుల కోలాటం, శ్రీకృష్ణుడు, గోపికల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

త్వరలో ఆక్వా జోన్‌గా దివిసీమ ప్రాంతం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ



కోడూరులో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: దివిసీమలోని తీరప్రాంత మండలాలను త్వరలో ఆక్వా జోన్‌లో చేర్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళవారం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతిపక్షాల నేతలు ఆక్వా సాగు గురించి చేస్తున్న విమర్శల్లో వాస్తవాలు లేవని, ప్రస్తుతం ఆక్వా సాగు సంబంధించి రీ–సర్వే ప్రక్రియ దివిసీమలో వేగవంతంగా సాగుతోందని రమేష్‌బాబు చెప్పారు. త్వరలోనే ఈ ప్రాంతాన్ని ఆక్వా జోన్‌గా ప్రకటించి రైతులకు అన్ని సబ్సిడీలు వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ నగదును రూ.2,500 నుంచి రూ.2750కు పెంచారని చెప్పారు. పెన్షన్లు తొలగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హత ఉంటే ఇంటికే పెన్షన్ నగదును పంపే కార్యక్రమం ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉందని, ఈ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు.

310 మందికి నూతన పింఛన్లు..

కోడూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో ఈ నెల నుంచి 310 మంది లబ్ధిదారులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే రమేష్‌బాబు తెలిపారు. గత నెల వరకు 7,074 పింఛన్లు ఉండగా, ప్రస్తుతం 7,384 మందికి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నిష్పక్షపాతంగా పని చేసి, మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం పెన్షన్ నగదును లబ్ధిదారులకు అందించారు. విజయవాడ సెంట్రల్ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు పాల్గొన్నారు.

గుంటూరు ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత..



గుంటూరు ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛను నగదు అందిస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మీ

భావదేవరపల్లి(నాగాయలంక): గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న రోగికి స్థానిక వలంటీర్ యర్రవరపు వెంకటలక్ష్మి మంగళవారం గుంటూరు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుకను అందజేశారు. మండలంలోని భావదేవరపల్లి శివారు కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన నల్లూరి బాలకోటేశ్వరమ్మకు ఆపరేషన్ జరుగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛను నగదు రూ.2,750ను ఆమెకు అందజేశారు. వలంటీర్ వెంకటలక్ష్మిని పలువురు అభినందించారు.

● నాగాయితిప్ప(మోపిదేవి): పెరిగిన, నూతన పింఛన్లను నాగాయితిప్పలో సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) మంగళవారం లబ్ధిదారులకు అందచేశారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, వెల్ఫేర్ అసిస్టెంట్ పీతా మహేష్, పాల కేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్‌బాబు, లింగం జగదీష్‌కుమార్, తాతా శ్రీకాంత్ పాల్గొన్నారు.



నాంచారయ్యకు పింఛను అందజేస్తున్న బందరు మేయర్ వెంకటేశ్వరమ్మ

బందరులో 97.90 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో మూడో రోజైన మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు. మొత్తం 97.90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. నగరంలో మొత్తం 18,690 పింఛన్లు ఉండగా వీటిలో 18,297 పింఛన్లను మంగళవారం నాటికి పంపిణీ చేశారు. ఇంకా 393 పింఛన్లు ఇవ్వాల్సి ఉంది. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్న 23వ డివిజన్‌లో వికలాంగుడు లోయ నాంచారయ్యకు ఆమె పింఛనును అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ వెల్ఫేర్ సెక్రటరీ టి. హేమభద్రరావు, వలంటీర్ మంజూష పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించండి

ఏఓ శ్రీనివాసరావు

పెడన: రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని రైతులకు తెలియజేయాలని పెడన వ్యవసాయశాఖాధికారి జీవీ శ్రీనివాసరావు అన్నారు. ఏఓ తన చాంబర్‌లో మండలంలోని వీఏఏలు, ఎంపీఈఓలతో మంగళవారం సమావేశమయ్యారు. ఏఓ మాట్లాడుతూ ధాన్యం 1.5 శాతం రంగు మారితే జీరో కిందే లెక్కించాలన్నారు. ఎనిమిది శాతం ఉంటే క్వింటాల్‌కు 3.9 కిలోలు తగ్గించాలని, పది శాతం ఉంటే ఐదు కిలోలు తగ్గించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పది శాతం కంటే అధికంగా ఉంటే మిల్లరు వద్దకు పంపించి అక్కడ కస్టోడియన్ సమక్షంలో ధర నిర్ణయించి రైతుకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఆ ధరకు రైతు అంగీకరించి అమ్ముకుంటే ఓకే చెప్పాలన్నారు. రైతు నుంచి సదరు మిల్లరు తీసుకుంటే ఆ మిల్లరే రైతుకు గోనె సంచులు, రవాణా చార్జీలు ఇస్తారనే విషయాన్ని రైతులకు తెలియజేయాలని చెప్పారు. ఈ విషయాలపై రైతులకు పూర్తి స్థాయిలోఅవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వీఏఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

పెడన పాలకవర్గంతో మంత్రి జోగి రమేష్ చర్చ



కౌన్సిల్ పాలకవర్గ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: పెడన మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో పెడన పాలకవర్గంతో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మంగళవారం కొద్దిసేపు ముఖాముఖీగా మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయానికి మంత్రి రావడంతో మున్సిపల్ పాలకవర్గం, వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు ఆయనను కలిశారు. దీంతో కొద్దిసేపు ఇష్టాగోష్టిగా చర్చించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, పట్టణ కన్వీనర్ మల్లి, కమిషనర్ అంజయ్య, కౌన్సిల్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. కప్తానుపాలెం బీసీ-బి, మోపిదేవి- ఎస్సీ, పెదప్రోలు-2 జనరల్‌కు కేటాయించారని చెప్పారు. అభ్యర్థులు స్థానికులై వివాహితులు, ఆ ఊరి కోడలై ఉండాలని, 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా తమ దరఖాస్తులను స్వయంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు, అవనిగడ్డ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

● బంటుమిల్లి: ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాజెక్టు అధికారి ఎం. సముద్రవేణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామవరపుమోడి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్ట్ ఓసీ కేటగిరీకి, రామవరపుమోడి, పెందుర్రు-1, నాగన్నచెరువు గ్రామాల్లోని సహాయకుల పోస్టులు ఓసీ అభ్యర్థులకు, అర్తమూరు దళితవాడ పోస్ట్ ఎస్సీకి కేటాయించారు. అలాగే కృత్తివెన్ను మండలం పడతడిక-1 (బీసీ-సీ), పెన్నమ్మదిబ్బ, కృత్తివెన్ను పల్లెపాలెం(బీసీ-ఏ), కాపుటూరు, యండపల్లి, పెద్దగొల్లపాలెం కేంద్రాల్లోని సహాయకుల పోస్టులు ఓసీలకు కేటాయించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 13వ తేదీలోగా బంటుమిల్లి ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ సముద్రవేణి కోరారు.

● అవనిగడ్డ: అవనిగడ్డ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీఓ పి. భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ ఏడవ కేంద్రంలో కార్యకర్త పోస్టు (ఎస్టీ), అవనిగడ్డ ఆరవ కేంద్రంలో సహాయకురాలు (బీసీ ఈ), మోపిదేవి మండలం కప్తానుపాలెంలో సహాయకురాలు (బీసీ బి), మోపిదేవిలో సహాయకురాలు (ఎస్సీ), పెదప్రోలు 2లో సహాయకురాలు (జనరల్), నాగాయలంక మండలం తలగడదీవిలో సహాయకురాలు (జనరల్), ఈలచెట్లదిబ్బలో సహాయకురాలు (బీసీ ఏ)కి కేటాయించామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు రెండుసెట్ల దరఖాస్తులను ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

● గూడూరు: మల్లవోలు-4 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గూడూరు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.సత్యనారాయణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కేటగిరీలోని పోస్టుకు 35 ఏళ్లు వయస్సు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక మహిళలు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 12వ తేదీ లోగా మచిలీపట్నంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

150 పశువులకు వైద్య పరీక్షలు



రైతులకు ఖనిజ మిశ్రమాన్ని అందిస్తున్న తోట కృష్ణ, డాక్టర్ మౌనిక

నంగేగడ్డ(నాగాయలంక): మండల పశు వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ తోట లంకమ్మ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 150 పశువులకు పశు వైద్యాధికారి డాక్టర్ మౌనిక వైద్యం అందించారు. ఈ సందర్భంగా పశువులకు వచ్చే ముద్దచర్మం వ్యాధిపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. గర్భకోశ వ్యాధుల నివారణ మందులు, నట్టల నివారణ మందులు, ఖనిజ మిశ్రమాన్ని గ్రామ ప్రముఖుడు తోట కృష్ణ చేతులమీదుగా ఉచితంగా అందజేశారు. సచివాలయ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఆక్వా జోన్ రీ సర్వేపై నివేదికలు ఇవ్వండి

నాగాయలంక: ఆక్వా జోన్ రీ సర్వే చేయకుండా మిగిలిన పాత చెరువులు, భూములను గుర్తించి క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి త్వరితగతిన నివేదికలు సమర్పించాలని ఆక్వా కల్చర్ చైర్మన్, తహసీల్దార్ జె.విమలకుమారి ఆదేశించారు. ఆక్వా జోన్ రీ సర్వేపై సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అవనిగడ్డ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వానపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఫీల్డ్ విజిట్ చేసి తయారు చేసిన జాబితాలు డీఎల్‌సీకి సమర్పిస్తామని, సదరు జాబితాలను గ్రామసభల్లో అమోదించాల్సి ఉంటుందని వివరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఏపీ సంజీవ్ కుమార్, ఇరిగేషన్ ఏఈ పొన్నూరు రవితేజ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, గ్రామ మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

● అవనిగడ్డ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాన్ ఆక్వా జోన్‌పై రీసర్వే చేసేందుకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్స్యశాఖ ఎఫ్‌డీఓ వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అగ్రికల్చర్, ఇరిగేషన్, వీఆర్వోలు, వీఎఫ్ఏలు, వీఏఏలు పాల్గొన్నారు. ఏయే భూములకు సర్వే నిర్వహించాలి, ఎలా నిర్వహించాలనే విషయమై ప్రభుత్వ నియమాలను ఎఫ్‌డీఓ సత్యనారాయణ వివరించారు. వీలైనంత త్వరంగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ రామకృష్ణ, ఏఓ శౌరమ్మ, మత్స్యశాఖ అసిస్టెంట్ రమ్యదీప్తి, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

నాగాయలంక: జూనియర్స్ ఉమెన్ సింగిల్ కయాక్ స్లాలమ్‌లో ఏపీ తరపున రజిత పతకం సాధించిన నాగాయలంక యువతి నాగిడి గాయత్రిని, పోటీల్లో పాల్గొన్న గౌతమి, భార్గవిలను స్థానిక నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో గత డిసెంబర్ 28, 29 తేదీల్లో జరిగిన 10వ కెనో స్లాలమ్ అండర్ 18 నేషనల్ చాంపియన్‌షిప్‌లో ఆమె ఈ ఘనత సాధించిన విషయం తెలిసిందే.

పలువురు మాట్లాడుతూ జల క్రీడాకారులను అభినందించారు. మహిళా నేత తలశిల స్వర్ణలత, రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి లకనం నాగాంజనేయులు, నేతాజీ సంఘం ప్రతినిధులు గడ్డిపాటి అమర్‌చంద్, తలశిల లీలామనోహర్, నాగిడి నాగబాబు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానించిన సంఘం సభ్యులు

వీఆర్వో కార్యాలయానికి కంప్యూటర్ బహూకరణ



పురిటిగడ్డ (చల్లపల్లి): పురిటిగడ్డ వీఆర్వో కార్యాలయానికి ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్‌బాబు కంప్యూటర్‌ను బహూకరించారు. మంగళవారం స్థానిక వీఆర్వో పరిశె కిరణ్ కుమార్‌కు రూ.52 వేల విలువైన కంప్యూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎం ప్రతినిధి వేములపల్లి స్విటిన్ రాస్ పాల్గొన్నారు.

బైక్ ఢీ కొని ఇద్దరికి గాయాలు

కోనేరుసెంటర్: బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బలరామునిపేటకు చెందిన గోనేపూడి సురేష్‌బాబు ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తుంటాడు. మంగళవారం బైక్‌పై గూడూరు వెళ్లి తిరిగి వస్తుండగా బైపాస్‌రోడ్డులో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన జోగి గోపీ సురేష్ వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో సురేష్, అతనితో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న మరో యువకుడికి గాయాలయ్యాయి. బాధితులను బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచి చేస్తున్న సీఎంను మరోసారి ఆదరించండి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- అవనిగడ్డ 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను ఇంటి ముంగిటకే చేరుస్తూ మంచి సీఎంగా గుర్తింపు పొందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోరారు. స్థానిక 8వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తక్కువ కాలంలోనే దేశంలో మంచి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని చెప్పారు. 8వ వార్డులో కరకట్టకు వెళ్లే అంతర్గత రహదారి, శ్మశాన వాటిక ఆక్రమణలను తొలగించాలని, సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని స్థానికులు ఎమ్మెల్యే సింహాద్రిని కోరగా ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సీబీసీఎన్‌సీ యూపీ స్కూల్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల విద్యుత్ కనెక్షన్ తొలగించారని హెచ్‌ఎం ఎమ్మెల్యేకి తెలియజేయగా, విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజాకుమారి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ గాజుల జయగోపాల్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ నలుకుర్తి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాద్రి రామనాథబాబు, కొడాలి దయానంద్, చింతలపూడి బాలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే పేర్ని నాని



చిలకలపూడి(మచిలీపట్నం): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో బందరు మండలానికి సంబంధించిన సమస్యలపై మంగళవారం ఆయన చర్చించారు. పేర్ని నాని మాట్లాడుతూ బందరు మండలంలో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని, సొసైటీలు రైతుల ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను సొసైటీలు సరిగా నిర్వహించకపోతే మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ధాన్యం తూకంలో తేడాలు, రవాణా సమస్యలు, గోనె సంచుల కొరత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులను ఏర్పాటు చేసి రైతులకు సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు.

సావిత్రీబాయి పూలే సేవలు ఆదర్శం



ఈడేపల్లిలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వీర రవి

మోపిదేవి: మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీర రవి అన్నారు. మత్స్యకార గురుకుల పాఠశాలలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. మహిళల విద్యాభివృద్ధికి ఆమె ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మచిలీపట్నంటౌన్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈడేపల్లిలోని సంఘ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే బహుజనుల విద్యాభివృద్ధికి కృషి చేశారని వివరించారు. సంఘ నాయకులు కోమటి శ్రీనివాస్, జోగి శివ, ధనికొండ చిన్ని, జన్ను గోవిందరాజులు, పోలగాని వెంకటేశ్వరరావు, పుట్టి రాజశేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్ల అందజేత



మెరిట్ సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థినీ విద్యార్థులు

బంటుమిల్లి: పెందుర్రు, ముంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మచిలీపట్నం ఎల్ఐసీ ఆధ్వర్యంలో అవార్డులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు, వారిలో పోటీ తత్వాన్ని పెంచేందుకు ఎస్‌బీసీ మెరిట్ సర్టిఫికెట్లు, అవార్డులతో అభినందిస్తోందని బ్రాంచి మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి పాఠశాలలోను ఆరు నుంచి పదో తరగతి వరకు ఇద్దరు మెరిట్ విద్యార్థులను గుర్తించి అవార్డులు అందచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులకు అవార్డులు అందచేశామని వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ అగస్టీన్, డీఓలు దిలీప్‌కుమార్, నాగరాజు, సీనియర్ ఏజెంట్లు యూపీఆర్ విఠల్, సీహెచ్‌ఎస్ మల్లికార్జునరావు, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ఆర్యవైశ్యులు పెద్దపీట



పేదలకు దుప్పట్లు అందించిన వాసవీ క్లబ్ ప్రతినిధులు

కోడూరు: పేదలకు సేవా కార్యక్రమాల నిర్వహణకు ఆర్యవైశ్యులు పెద్దపీట వేస్తారని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ ముక్తేశ్వరరావు అన్నారు. స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో వాసవీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం క్లబ్ జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా దేసు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా అరవపల్లి శివరామకృష్ణప్రసాద్, కోశాధికారిగా కోడూరు వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీని దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం పలువురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ కో–ఆర్డినేటర్ బూరగడ్డ హరనాథ్‌బాబు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మద్దాలి ప్రసాద్, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఆలపాటి ప్రభాకరరావు, జిల్లా క్యాబినేట్ కోశాధికారి సత్యనారాయణ, ఆర్యవైశ్య ప్రముఖులు అన్నం శ్రీనివాస్, కొత్త గణేష్‌బాబు, చిట్టూరి శ్రీనివాసరావు, గాదె మోహనబాబు, వరదా భరత్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.